క్లుప్తంగా

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



గట్టు: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి సూచించారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నాయకులు మొక్కలను నాటారు. రెండు రోజుల పాటు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో తప్పనిసరిగా 10 మొక్కలను నాటాలని కోరారు.

21న పరిచయ వేదిక

అయిజ: మహబూబ్‌నగర్‌లో ఈనెల 21న వాసవి గార్డెన్స్‌లో నిర్వహించనున్న ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంఘం జిల్లా చైర్మన్ కొడూరి రాజయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వివాహ పరిచయ వేదికకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

మానవపాడు: ప్రతి గ్రామాల్లో అందరూ కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శాంతినగర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఏ.బుర్దిపాడులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన కూడళ్లు, స్కూల్ వంటి ముఖ్య సమూహాల్లో, ప్రార్థన మందిరాల్లో సీసీ కెమారాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటన్న, జగన్‌మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, భరత్‌సింహారెడ్డి, రాజశేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని ఓ రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీకి గురైంది. దీనిపై శుక్రవారం సూపర్‌వైజర్ పెద్దిరెడ్డి సంజీవ్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్లపైనే మురుగు



శాంతినగర్: సీసీ రోడ్లు వేసి డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ప్రధాన రహదారులపై మురుగు ప్రవహిస్తోంది. వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లిలోని ప్రధాన రహదారుల్లో సీసీ రోడ్లు వేశారు. రెండు వైపులా డ్రెయినేజీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్లలో నుంచి వచ్చే నీరు, వర్షపునీరు సీసీ రోడ్లపై ప్రవహిస్తూ కంపు కొడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై మురుగు పడుతోంది. డ్రెయినేజీ నిర్మించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



శాంతినగర్: ప్రధాన రహదారి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి, వాటికి రక్షణ కంచె ఏర్పాటు చేయడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. స్థానిక రాయచూర్ రోడ్డు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కనీసం రక్షణ కంచె ఏర్పాటు చేయలేదని, ఎవరికైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని పట్టణ ప్రజలు అందోళన వ్యక్తంచేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అక్కడక్కడ జంతువులు చనిపోవడంతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని చెబుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మహిళపై దాడి: కేసు నమోదు

ఉండవెల్లి: మహిళపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అలంపూర్‌చౌరస్తాలో అన్నదమ్ములు యూసుఫ్ మియ్యా, హుస్సేన్‌లకు చెరో 28 గుంటల పొలం ఉండగా, కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మానవపాడు మండలం పెద్ద పోతలపాడు చెందిన హుస్సేన్ అక్రమంగా అతని అన్న పొలంలో గుంతలు తవ్వి గోడలు కట్టడంతో, ప్రశ్నించిన యూసుఫ్‌మియ్యా భార్య రజియాబీని తలపై ఇనుప గొలుసుతో దాడి చేశారు. రజియాబీ తలకు తీవ్ర గాయాలు కావడంతో హుస్సేన్‌పై శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

నిధులు రాక నిరుపయోగం

- వలు అభివృద్ధి పనులను మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు, ప్రజలు



తిమ్మాజిపల్లిలో నిలిచిపోయిన పాఠశాల అదనపు గదుల నిర్మాణం

శాంతినగర్: ఒకప్పుడు ప్రజాప్రతినిధులు పనులు కావాలని, గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలని, ప్రజలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పనులు మంజూరై సొంత డబ్బులు రూ.లక్షలు వెచ్చించి చేసినా బిల్లులు రాకపోవడంతో పంచాయతీరాజ్, ఈజీఎస్, విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా పంచాయతీల్లో రెండేళ్లుగా పాఠశాలల్లో, పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. కొన్ని పనులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేపట్టగా మరికొన్ని పనులను కాంట్రాక్టర్‌లు మొదలుపెట్టారు. పనులు చేసి రెండేళ్లయినా బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. అసంపూర్తిగా పనులు ఉండటంతో విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగపడకపోవడం, ఇటు కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు బిల్లులు కాకపోవడంతో మాజీ ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో అర్ధాంతరంగా

నియోజకవర్గంలోని ఆయా పాఠశాలలకు మన ఊరు–మన బడి కింద రూ.లక్షల పనులు మంజూరయ్యా యి. ఆయా పాఠశాలల్లో పనులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లు చేపట్టారు. సగం వరకు పనులు పూర్తిచేసినా ఒక్క బిల్లు రాకపోవడంతో పనులు ఆపేశారు. పాఠశాలల్లో చేపట్టిన ఫ్లోరింగ్, కాంపౌండ్‌వాల్స్, అదనపు గదులు, టాయిలెట్స్ పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



యాపదిన్నెలో ఫ్లోరింగ్ పనులు చేయకపోవడంతో పాఠశాల తరగతి గది

పూర్తికాని పంచాయతి భవనాలు

కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు భవనాలు లేక ఇబ్బందులకు గురవుతుండగా కొత్త భవనాల నిర్మాణాలకు రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. పనులు మొదలుపెట్టిన సర్పంచ్‌లు 80 శాతం వరకు పూర్తిచేశారు. ఇప్పటి వరకు ఒక్క బిల్లు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుతం వారి పదవీ కాలం పూర్తవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వడ్డీకి తెచ్చి పెట్టుబడులు పెట్టామని, బిల్లులు రాకపోవడంతో ఆస్తులు అమ్మి కట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో అదే పరిస్థితి

నియోజవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు ఉత్సాహంగా పనులు మొదలుపెట్టారు. సగం వరకు పనులు పూర్తిచేసినప్పటికి బిల్లులు రాకపోవడంతో నిలిపివేశారు. దీంతో అటు కాంట్రాక్టర్లు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రూ.14 లక్షలు పెట్టుబడి పెట్టా..



పాఠశాలకు రెండు అదనపు గదులు మంజూరయ్యాయి. పనులు తొందరగా చేస్తే పిల్లలకు బాగుంటుందని గ్రామస్తులు సూచించారు. పిల్లల చదువు కోసం 80 శాతం వరకు పనులు పూర్తిచేశాను. బిల్లు కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాను. జెడ్పీటీసీ ఫండ్ రూ.7 లక్షలు వచ్చాయి. ఎంపీపీ నిధులు రూ.7 లక్షలు రాలేదు. ఏడాదికాలంగా ఎదురుచూశాను. డబ్బులు లేక పనులు ఆపేశాను. బిల్లు ఇస్తే మిగతా పనిని నెల రోజుల్లో పూర్తిచేసి పాఠశాలకు అప్పగిస్తాను. – శివశంకర్, తిమ్మాజిపల్లి, వడ్డేపల్లి మండలం

పిల్లలు కూర్చోడానికి లేదు



ఎప్పుడో నిర్మించిన పాఠశాలలో బండలు చిందరవందరగా ఉన్నాయని, పనులు చేపట్టడానికి నిధులు ఇచ్చారంటే సంతోషించాం. పిల్లలు చదువుకోడానికి, కూర్చోడానికి సౌకర్యం కలుగుతుందని ఆనందించాం. బండలు తొలగించి ఏడాది గడుస్తున్నా పనులు చేయడంలేదు. ఒకే గదిలో రెండు తరగతులు చెబుతున్నారు. వెంటనే బండపరుపు పనులు పూర్తిచేసి పిల్లల చదువులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

– ఎల్లప్ప, యాపదిన్నె, అయిజ మండలం

మధ్యలోనే నిలిపేశారు



మాది మారుమూల గ్రామం. కొత్తగా పంచాయతీ అయ్యింది. పంచాయతీ భవనం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలోని చిన్న గదిలో కొనసాగిస్తున్నారు. కొత్త భవనానికి పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ 80 శాతంవరకు పూర్తిచేశాడు. బిల్లు రాలేదని మధ్యలోనే ఆపేశాడు.

– చిన్న కృష్ణ, కుర్వపల్లి, అయిజ మండలం

బాలల హక్కులను కాపాడుదాం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహులు

గట్టు: బాలల బంగారు భవిష్యత్‌కు పునాదులు పడేది పాఠశాలలోనే అని, బాలలందరూ చదువుకునే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యం పిల్లల హక్కు అని, అందరూ కూడా స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని తెలిపారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి తెలిపారు. వేధింపులకు గురైన వారు 100, 1098కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ సిబ్బంది లక్ష్మీదేవి, పద్మ, మెడికల్ ఆఫీసర్ రమేష్, నవీన్, శోభ, నల్లారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



ముళ్లపొదల తొలగింపు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ చిన్నదేవన్న, అధికారులు

అయిజ: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, అధికారులు కలిసి పర్యటించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో పారిశుద్ధ్య పడకేసిందని, దోమల ఉధృతి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని కాలనీల ప్రజలు వాపోయారు. విద్యుత్ స్తంభాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదని, సుదూర ప్రాంతాల నుంచి సర్వీస్ వైర్‌తో విద్యుత్ సరఫరాను వినియోగించుకుంటున్నామని తెలిపారు. అక్కడక్కడ నిర్మించిన డ్రెయినేజీల్లో సకాలంలో పూడిక తీయడంలేదని వాపోయారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించలేమని, ఉన్న డ్రెయినేజీల్లో రెండు, మూడు రోజులకొకసారి పూడిక తీయిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్లు విజయ్, పవన్, ప్రకాష్, వార్డు ఆఫీసర్లు, కార్మికులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. 1, 2 వార్డుల్లో సిబ్బంది ద్వారా దోమల నివారణ మందు పిచికారి చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో దోమలు మందు పిచికారి చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

ప్రైవేట్‌కు అప్పగించడానికి ప్రయత్నం



అలంపూర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అలంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడానికి ప్రయత్నం చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ ఆరోపించారు. పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని నల్లబ్యాడ్జీలతో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకొచ్చిన మైండ్స్ అండ్ మినరల్ యాక్ట్ సవరణల బిల్లుపై గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మౌనంగా ఉండిపోయిందన్నారు. 2021లో జరిగిన హోల్ బ్లాక్‌ల వేలంలో సింగరేణి సంస్థను పాల్గొనకుండా చేశారని ఆరోపించారు. ఆ రోజు నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. సింగరేణి బొగ్గు గనులను బహిరంగంగానే వేలంపాట వేయడం వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం కలుగుతుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాట రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో సిద్దయ్య, కమాల్, వసంత్ కుమార్, రవి, గణేష్, శ్రీనివాసులు, కృష్ణ ఉన్నారు.

మానవపాడు: సింగరేణి బొగ్గు గనుల వేలంపాటను రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు భాస్కర్, మహేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



పాగుంటలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



మల్దకల్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల భక్తులు దాసంగాలు నిర్వహించారు.

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, కోతులగిద్ద అరణ్ణేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పొగాకు కంపెనీ ప్రతినిధులు అన్నదానం నిర్వహించారు.



పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

నిరసనకారుల ముందస్తు అరెస్ట్



అయిజ పోలీస్‌స్టేషన్‌లో నిరుద్యోగ సంఘం నాయకులు

అయిజ: టీజీపీఎస్సీ ముట్టడిలో భాగంగా అలంపూర్ నియోజకవర్గ నిరుద్యోగ జేఏసీ నాయకులను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఈసందర్భంగా నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. అక్రమ అరెస్టులను నిలిపివేయాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, ప్రభుత్వం వెంటనే డీఎస్సీ పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు మూడు నెలల గడువు పెంచాలని కోరారు.

ఉండవెల్లి: బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, మహేంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండవెల్లి: తమ పొలాన్ని అక్రమంగా దున్నారని ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మహమ్మద్ బాబు చెందిన 1.13ఎకరాల పొలాన్ని వడ్డె ఈశ్వరన్న నుంచి కొనుగోలు చేసుకున్నారు. ప్రస్తుతం పొలంలో మహమ్మద్ బాబు కంది, జూట్ విత్తనాలు సాగు చేశాడు. కాగా వడ్డే ఈశ్వరన్న మృతి చెందడంతో, భార్య సువర్ణ పొలం తమదేనని ట్రాక్టర్‌తో దున్నించింది. పంట పొలాన్ని అక్రమంగా దున్నించిన సువర్ణ, ట్రాక్టర్ డ్రైవర్ బోయ రంగాపై మహమ్మద్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్‌పాస్ కౌంటర్ కొనసాగించాలి

అలంపూర్: ఆర్టీసీ బస్‌పాస్ రెన్యూవల్ కౌంటర్‌ను కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. అలంపూర్ చౌరస్తాలోని ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇక్కడ ఉన్న కౌంటర్ కొన్ని రోజులుగా తెరవడం లేదని, ఇక్కడికి వచ్చిన విద్యార్థులు తన దృష్టికి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఫోన్ ద్వారా ఆర్టీసీ డీఎంకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అక్కడ ఆర్టీసీకి చెందిన మెకానిక్‌లు ఉన్నారని వారికి ఇస్తే గద్వాలలో ఉన్న పాస్ కౌంటర్‌లో రెన్యూవల్ చేసి తెస్తారని సమాధానం ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వం మహిళలకు, బాలికలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే అధికారులు ఏకంగా పాస్ రెన్యూవల్ కౌంటర్‌ను మూసి వేస్తే మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆర్టీసీ అధికారులు లింగనవాయి, కోనేరు, బుక్కాపురం, గుందిమల్ల, బైరంపల్లి మీదుగా అలంపూర్ కళాశాలల విద్యార్థుల కోసం బస్సు నడుపుతున్నారని గుర్తు చేశారు. కానీ ఆ బస్సులో ప్రయాణించే విద్యార్థులకు పాస్ రెన్యూవల్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అలంపూర్ చౌరస్తాలో ఉన్న ప్రైవేట్ విద్యాలయాలకు, కళాశాలకు మూడు మండలాల నుంచి విద్యార్థులు వస్తున్నారని వారికి పాస్ రెన్యూవల్‌కు కష్టాలు తప్పడం లేదన్నారు. రెన్యూవల్ కౌంటర్ లేకపోవడంతో దివ్యాంగులు తమ పాస్‌లు పొందడానికి గద్వాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు రెన్యూవల్ బస్ పాస్ సెంటర్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

అధికారుల సూచనలు పాటించాలి



ఆర్.గార్లపాడులో పంట నమోదు చేస్తున్న ఏఈఓ మౌనిక

ఎర్రవల్లిచౌరస్తా: రైతులు పంటల సస్యరక్షణలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఈఓ మౌనిక తెలిపారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడు, బీ.వీరాపురం ఆమె సందర్శించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, మిరప పంటలను సందర్శించి సర్వే నంబర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు వానాకాలంలో సాగు చేసిన పంటల సస్యరక్షణలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



కొండేరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ అశోక్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరు ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి హాజరై పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మాన్‌దొడ్డి గ్రామంలో సూచికబోర్డు లేని ప్రమాదకర మలుప

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయని, అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామం గుండా నసనూరు, చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధాన రోడ్డు మొత్తం గ్రామంలోని ఇళ్ల పక్కనే ఉండటం, చిన్నపాటి సందులు, ప్రమాదకర మలుపులు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మలుపు దగ్గరకు వచ్చే వరకు అక్కడ మలుపు ఉన్న సంగతి తెలియకపోవడంతో ఆకస్మాత్తుగా వాహనాన్ని నియంత్రించాలంటే ఇబ్బందికంగా ఉంటుంది. ఇళ్లు రోడ్డు పక్కనే ఉండటంతో చిన్న పిల్లలు అనుకోకుండా బయటకు రావడం, ఎదురుగా వాహనాలు వస్తే రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదని ఆయా గ్రామాల వాహనదారులు పేర్కొంటున్నారు. కనీసం మలుపులు ఉన్న చోట సూచిక బోర్డు, అవతలి నుంచి వస్తున్న వాహనాలు కనిపించే విధంగా అద్దాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

భారీ వర్షం.. రైతుల హర్షం



కేటీదొడ్డిలో కురుస్తున్న వర్షం

కేటీదొడ్డి: మండలంలోని శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గంట పాటు కుండపోత వర్షం కురిసింది. ముంగారు పంటల సాగు అనుకూలంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట పంటల్లో విత్తుకున్న విత్తనాలు త్వరగా మొలకెత్తేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు. నారు మడులు వేసుకున్న రైతులు వరినాట్లకు కరిగెటు చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

ధరూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు కుండపోత వాన కురిసింది.